
# హంసగీతం

**కొ**డుకు లిద్దరి దగ్గర్నుండీ వచ్చిన ఉత్తరాలు రాధాకృష్ణయ్య మనస్సును నొప్పించాయి. కొడుకులు విడివిడిగా రాసినా వాటిల్లో వున్న సారాంశం మాత్రం ఒకటే! రామా కృష్ణా అనుకుంటూ శేషజీవితాన్ని గడపక అర్థం పర్థంలేని పనులకు డబ్బు తగలేస్తున్నావంటూ ఒకటే నిష్ఠూరాలు.



అసలు తనమీద వీళ్లపెత్తనం ఏమిటి? చిన్నప్పట్నుండీ కష్టం తెలీకుండా పెంచాడు. పెద్ద పెద్ద చదువులకోసం ఖర్చుకు వెనుకాడకుండా అన్ని వసరులూ సమకూర్చాడు.

ఉద్యోగాల్లో స్థిరపడేందుకు తనశక్తియుక్తుల్ని వుపయోగించాడు. పెళ్లిళ్ల జరిపించడంతో పాటు ఆర్థికంగా వాళ్లు నిలదొక్కుకునేందుకు ఆస్తుల్నీ పంచి ఇచ్చాడు. ఇంతచేసినా తననుండి వీళ్లు ఇంకా ఆశించేదేమిటి? ఇంటితోపాటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో కొంతభాగం తనకంటూ వుంచుకున్నాడు. నెలనెలా పెన్షన్ వస్తున్నది. పిల్లల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరంగాని, అగత్యంగాని లేకుండా జాగ్రత్తపడ్డాడు.

ఒక విశ్వాసంతో, ఆత్మసంతృప్తికోసం తను చేపట్టిన పనిని కాదనే హక్కు వీళ్లకి ఎక్కడిది? అందుకోసం కొడుకుల్నే కాదు ఎవరి ఆర్థిక సహాయమూ తను కోరలేదు. తన కష్టార్జితాన్ని మాత్రమే ఆ పనికి వినియోగిస్తున్నాడు. తన ఆకాంక్షను కాదంటూ వీళ్ల ఆంక్షలేమిటి?

* * *

రెండు నెలల క్రితం ఒక పత్రికలో వచ్చిన వార్త రాధాకృష్ణయ్య దృష్టిని విశేషంగా ఆకర్షించింది. అంతరించి పోతుందనుకుంటున్న అరుదైన ఒక జాతిపక్షి రాయలసీమ ప్రాంతంలో ఒక వేటగాడికి దొరికిందనీ, అది డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసరు ఆధ్వర్యంలో సరైన ఆలనా పాలనా లేకుండా పడివుందనీ రాశారు. ఒక ఆర్నిథాలజిస్ట్ అభిప్రాయం ప్రకారం "గ్రూయి ఫార్మిస్" క్రమానికి చెందిన పక్షని, ఇంచుమించు బట్టమేక పక్షిలాంటి లక్షణాలను కలిగివుందన్నారు. సాధుజీవులైన ఈ పక్షులు అంతరించి పోవటానికి మనుషుల వేటే ప్రధాన కారణమనీ తెలియవచ్చింది. అదేజాతి పక్షి మరొకటి 'లాల్‌బహదూర్ యూనివర్సిటీ' బర్డ్స్ శాంక్చువరీలో వుందనీ, ఈ రెండు పక్షులే ఈ జాతిలో చిట్టచివరివి కావచ్చని రాశారు. యూనివర్సిటీ శాంక్చువరీలో వున్నది ఆడపక్షని, రాయలసీమ ప్రాంతంలో దొరికింది మగపక్షని రాసిన అంశం రాధాకృష్ణయ్య మనసులో ఎన్నో ఆలోచనలను రేకెత్తించింది. ఆ ఆలోచనలే ఆయనను ఉత్తేజపరచి కార్యోన్ముఖుడ్ని చేశాయి.

రాధాకృష్ణయ్య వెంటనే బయల్దేరి రాయలసీమ వెళ్లాడు. డి.యస్.ఓని కలిశాడు.

"సర్! మీదగ్గరున్న పక్షిని నాకప్పగిస్తే దాని సంరక్షణ బాధ్యత నేను స్వీకరిస్తాను" చెప్పాడు రాధాకృష్ణయ్య.

డి.ఎఫ్.ఓకు ఆశ్చర్యం వేసింది. ఒక మనిషి అంత ఆసక్తిగా ఈ పక్షిని వెతుక్కుంటూ ఎక్కడి నుండో ఇక్కడకు రావటం ఏమిటనిపించింది.

"ఈ పక్షిని తీసుకెళ్లి మీరేంచేస్తారు?" ప్రశ్నించాడాయన ఉత్సుకతతో.

తనేం చెయ్యదలిచాడో వివరించాడు రాధాకృష్ణయ్య. అతను చెప్పినదంతా శ్రద్ధగా ఆలకించాడు డి.యఫ్.ఓ. కాని అలా ఇవ్వటం అంత తేలిగ్గా సాధ్యపడే విషయం కాదని తేల్చి చెప్పాడు.

"సర్! నేను జంతుశాస్త్రంలో ప్రొఫెసర్‌గా రిటైరైన వాణ్ణి. ఇట్లాంటి వాతావరణంలో సరైన ఆలనా పాలనా లేకపోతే ఆ పక్షి చనిపోయే ప్రమాదముంది. నిబంధనల పేరుతో అరుదుగా వచ్చిన ఈ ఆఖరి అవకాశాన్ని చేజార్చకండి. ప్లీజ్! నేను తలపెట్టిన కార్యాన్ని సఫలం చెయ్యటంలో మీరూ సహకరించాలి". ఎంతో అభ్యర్థించాడు.

అసలు కాదు కూడదన్న మనిషి మెత్తబడ్డాడు. పై అధికారులను సంప్రదించి వారు అనుమతించాక పక్షిని అప్పగించడానికి సమ్మతించాడు. ఈ బాధ్యతను పవిత్రంగా నిర్వర్తించగలననీ, పక్షి సంరక్షణ బాధ్యతను ఎలాంటి పరిస్థితుల్లోను విస్మరించననీ హామీ పత్రం రాయించుకున్నాడు.

రాధాకృష్ణయ్య ఆ పక్షి బంధించి ఉంచబడిన గదిలోకి అడుగు పెట్టాడు. మనుషుల్ని చూస్తూనే బెదురు చూపులు చూస్తూ భయంతో అరిచింది. పట్టుకోబోతే అందకుండా తప్పించుకొనే ప్రయత్నం చేసింది. కాని, అందుకు తగినంత శక్తి లేక వెంటనే దొరికిపోయింది.

“డోంట్ వర్రీ! నీకెలాంటి ఆపదా రానివ్వను. నా బిడ్డలా నిన్ను సాకుతాను” అంటూ రాధాకృష్ణయ్య ఆ పక్షిని చేతుల్లోకి తీసుకుని స్నేహ పూర్వకంగా నిమిరాడు.

సుమారు ఒక మీటర్ ఎత్తు, పదిహేను కేజీల బరువు, దేహం మీద ఈకలు డీప్ బఫ్ కలర్‌లో నలుపు వర్ణ మిశ్రమంలో వున్నాయి. పొడవైన కాళ్లతో ఉదరభాగం, మెడభాగం తెల్లగా, తలపై భాగం నల్లగా, కొసదేలిన చిన్నముక్కుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నది.

మెటాడర్ వ్యానొకటి బాడుగకు మాట్లాడుకొని అందులో భద్రంగా తీసుకొచ్చాడు. ఆ పక్షిని ఒడిలోకి తీసుకొని దారి పొడుగునా దాని కెన్నో కబుర్లు చెప్పాడు. ఆహారం పెట్టాడు. నీళ్లు పట్టాడు.

“మా ఊరిలో నీకో మంచి నేస్తాన్ని జత చేస్తానోయ్! మీరు జంటగా చెట్టాపట్టాలేసుకొని జాలీగా తిరగొచ్చు” అంటూ ఆ పక్షిని ముద్దులాడాడు.

ఊరు చేరేసరికి ఆ పక్షికి బెదురు తగ్గి మాలిమి కూడా అయింది. ‘గరుడ’ అన్న ముద్దుపేరు కూడా దానికి పెట్టాడు.

ఊరునుండొచ్చిన మర్నాడే యూనివర్సిటీకెళ్లాడు. బర్డ్స్ శాంక్చువరీ ఇన్‌ఛార్జిని కలిశాడు.

“చూడండి! మీ శాంక్చువరీలో వున్న పక్షికి జతగా నేనొక పక్షిని తీసుకొచ్చాను. మీ దగ్గరున్న పక్షిని అప్పగిస్తే రెండూ జతగా కలిసి మెలసి వుంటాయి. వాటిని కంటికి రెప్పలా చూసుకుంటాను” చెప్పాడు రాధాకృష్ణయ్య.

“నో సర్! శాంక్చువరీలో వున్న పక్షుల్ని ఇలా అడిగిన వారికల్లా ఇవ్వటం సాధ్యపడదు” చెప్పాడు ఇన్‌ఛార్జి దుర్గారావు.

“మిస్టర్ దుర్గారావు! కేవలం సరదాకోసమో, గొప్పకోసమో. వాటిని పెంచాలన్న అభిలాషతో వచ్చిన వాణ్ణి కాదు. నాకో లక్ష్యం వుంది. ఎంతో బాధ్యతతో వాటిని సంరక్షిస్తాను”. వివరించాడు రాధాకృష్ణయ్య.

"మీరు వైస్ ఛాన్స్‌లర్‌ని కలిసి చూడండి. ఈ విషయంలో నిర్ణయాధికారం ఆయనకే వుంది" అన్నాడు దుర్గారావు.

తక్షణమే రాధాకృష్ణయ్య వైస్ ఛాన్స్‌లర్‌ని కలిశాడు. అతను చెప్పినదంతా విని ఎంతో సంతోషపడ్డాడు వైస్ ఛాన్స్‌లర్.

"సీ మిష్టర్ రాధాకృష్ణయ్య! నిబంధనలు పూర్తిగా సడలించలేను కాని ఒక్క వెసులుబాటు కల్పించగలను. మీ దగ్గరున్న పక్షిని కూడా మా శాంక్చువరీలో వుంచడానికి, వాటి సంరక్షణ బాధ్యతను పూర్తిగా మీకు అప్పగించడానికీ అనుమతించగలను" చెప్పాడు వైస్ ఛాన్స్‌లర్.

ఆ మాత్రం అవకాశం ఇచ్చినందుకే రాధాకృష్ణయ్య ఎంతో సంబరపడ్డాడు. మర్నాడే గరుడని శాంక్చువరీకి తీసుకొచ్చాడు.

తన కోసం కేటాయించ బడిన కొద్దిపాటి స్థలంలో బిక్కు బిక్కుమంటూ ఓ మూల పడుకుని వున్న ఆడపక్షి గరుడను చూస్తూనే హుషారుగా లేచి నిలబడింది. కుర్ కుర్ మని అరుస్తూ అక్కడనే గింగిరాలు తిరిగింది. చూడటానికి అన్ని విధాల బాహ్యాలక్షణాల్లో గరుడను పోలివున్న ఆడపక్షి కేవలం పరిమాణంలో మాత్రం గరుడకంటే చిన్నదిగా వుంది. రాధాకృష్ణయ్య చేతిలో వున్న గరుడను కింద దించాడో లేదో పరుగున దాని చెంతకు వచ్చింది. ఆత్మీయంగా పరామర్శిస్తున్నట్లు ముక్కుతో సున్నితంగా గరుడ మెడ మీద గీతలు గీసింది. రెండూ జత కట్టి అటూ ఇటూ తిరుగుతుంటే రాధాకృష్ణయ్య మనస్సు ఆనందంతో నిండింది.

గరుడ వుండాల్సినంత చురుగ్గా లేక పోవడం, ఒక మూలకు వెళ్లి ఒదిగి పడుకోవటం, ఆహారం సరిగా తినక పోవటం గమనించి అనారోగ్యానికి గురయిందన్న అనుమానంతో వెటర్నరీ డాక్టర్ని తీసుకొచ్చి క్షుణ్ణంగా పరీక్ష చేయించాడు.

"ప్రత్యేకంగా సిక్‌నెస్ అంటూ ఏం లేదు. పరిసరాలు, కొత్త వాతావరణంలో ఇమడటానికి కొద్దిరోజులు పట్టొచ్చు" అంటూ మందు పొడొకటిచ్చి నీటితో కలిపి వారం రోజులు తాగించమన్నాడు.

ఇప్పుడు రాధాకృష్ణయ్య దిన చర్య మారిపోయింది. ఉదయం ఏడు గంటల కల్లా బయల్దేరి యూనివర్సిటీకి రావటం, పక్షులకు ఆహారం, నీళ్లు అందిస్తూ చీకటి పడేదాకా వాటితో ఆటపాటలతో గడపటం, అవి విశ్రాంతి తీసుకుంటున్న వేళ తిరిగి ఇంటికి చేరుకోవటం, కొద్ది రోజుల్లోనే వాటితో మంచి స్నేహం సంపాదించగలిగాడు. ఆడపక్షికి 'రాణి' అన్న ముద్దు పేరు పెట్టాడు.

గరుడ క్రమంగా చైతన్యాన్ని పుంజుకొంటూ తన నేస్తంతో ఆటలు మొదలు పెట్టింది. అది కోలుకొంటున్నందుకు రాధాకృష్ణయ్య తేలిగ్గా ఊపిరి తీసుకున్నాడు. జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేసిన రాధాకృష్ణయ్యకు ఆర్నిథాలజీలో అంతగా పరిచయం లేదు. తన లక్ష్యసాధనకే ఆర్నిథాలజీ అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఎంతో వుందని గ్రహించాడు.

భారత దేశంలో పక్షులమీద అధ్యయనం 19వ శతాబ్ది ప్రారంభంలో మొదలైనప్పట్నుండి ప్రచురింపబడిన అనేక గ్రంథాలు సేకరించటం మొదలుపెట్టాడు. టి.సి.జెర్డాన్ రాసిన 'ది బర్డ్స్ ఆఫ్ ఇండియా' మొదలుకొని, బర్డ్ వాచర్ ఏ.ఓ.హ్యూమ్ రాసిన 'స్ట్రే ఫెదర్స్' 11 భాగాలు, 'ఫాన్ ఆఫ్ బ్రిటీష్ ఇండియా' సిరీస్‌లో ఒట్స్, బ్లాన్‌ఫోర్డ్ వెలువరించిన నాలుగు భాగాలు, ఇండియన్ బర్డ్ మేన్ సలీం అలీ, 'ది బుక్ ఆఫ్ ఇండియన్ బర్డ్స్' వరకు సేకరించి చదవసాగాడు.

పగలంతా పక్షులతో గడపటం, రాత్రిళ్లు అలసటతో ఒళ్లు మరచి నిద్రలోకి జారేవరకు పుస్తకాలు చదవటం, నోట్సు తయారు చేసుకోటం నిత్యకృత్యమైంది.

పక్షులు జత కట్టడం, గూళ్లు కట్టుకోవటం, ఆహారసేకరణ, సంపర్కం కోసం మగపక్షులు చేసే విచిత్ర విన్యాసాలు, ఆడపక్షులు గుడ్లు పెట్టడం, పిల్లల్ని చెయ్యటం, పోషించడం, వేలాది మైళ్లు వలసపోవటం మొదలైన వాటి జీవన విధానాన్ని గురించిన ఎన్నో ఆసక్తి కరమైన విషయాలను గ్రహించగలిగాడు.

యూనివర్సిటీ టీచింగ్ స్టాఫ్‌లో చాలా మందికి రాధాకృష్ణయ్య చేస్తున్న పని పట్ల సదవగాహన లేకపోయింది.

"ఏం ప్రొఫెసర్ జీ! ఫాదర్ ఆఫ్‌ది బర్డ్స్ అన్న బిరుదు కోసం ఏమన్నా ప్రయత్నిస్తున్నారా?" అంటూ కాస్త వేళాకోళాలు ఆడటం మొదలు పెట్టారు. అవి అతని ఏకాగ్రతను ఏమాత్రం భంగపరచలేక పోయాయి.

వసంత, గ్రీష్మ ఋతువులే సాధారణంగా పక్షులు గుడ్లు పెట్టే కాలం. వేసవి వచ్చేసింది. వాతావరణంలో ఎన్నో మార్పులొచ్చాయి. రాధాకృష్ణయ్యలో ఉత్కంఠ చోటు చేసుకొన్నది. ఋతుకాలంలో పక్షుల్లో కనిపించాల్సిన మార్పుల కోసం నిశితంగా వాటిని పరిశీలించసాగాడు.

మగపక్షి ఆడపక్షిని ఆకర్షించడం కోసం ఎలాంటి ధ్వని సంకేతాల నివ్వటంలేదు. సంపర్కం కోసం తహ తహ లాడుతూ శృంగార నృత్యం చెయ్యటం లేదు. తన దేహపు రంగుల్ని మార్చుకొని ఆడపక్షిని సమ్మోహన పరచటం లేదు. స్తబ్ధంగా వుంది.

రాధాకృష్ణయ్య కలవరపడసాగాడు. తను ఆశించింది జరగదేమోనన్న అనుమానం పీడించసాగింది. వెటర్నరీ డాక్టర్‌ని తీసుకొచ్చి పరీక్షలు చేయించాడు. డాక్టర్ ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేవని తేల్చి చెప్పాడు.

ఆ సమయంలోనే స్కూళ్లకు వేసవి సెలవులిస్తే పిల్లల్ని తీసుకుని కొడుకులు వచ్చారు. రాధాకృష్ణయ్య అస్తమానం ఆ పక్షులు గురించే ఆలోచిస్తుండటం, వాటి విశేషాలే చెప్తుండటం, తన సమయాన్నంతా వాటి మంచి చెడ్డలు చూడటానికే వెచ్చించడం కొడుకులకే మాత్రం రుచించలేదు.

రాధాకృష్ణయ్య మనవళ్లకు మాత్రం తాతయ్య చేస్తున్న పని బాగా నచ్చింది. రోజూ తాతతో పాటు యూనివర్సిటీకి వెళ్ల సాగారు.

"తాతయ్యా! ఈ పక్షులు ఏం పెడితే ఇష్టంగా తింటాయి?" అడిగారు. "మిడతలు, గడ్డిపురుగులు, గాజుపురుగులు, ఇలకోళ్లు అంటే వీటికి ఎంతో ఇష్టం" చెప్పాడు రాధాకృష్ణయ్య

తాతయ్య చెప్పిందే తడవుగా చెట్లంటా, తుప్పలవెంట పడి మిడతలు, పురుగులు పట్టి తెచ్చి వాటికి ఆహారంగా పెట్టసాగారు. అవి ముక్కులతో వాటిని టక టకా పొడుచుకు తింటుంటే వాళ్లకు చెప్పలేనంత సంబరంగా వుంది.

"తాతయ్యా! అసలు వీటిని నువ్వెందుకు పెంచుతున్నావు?" అడిగాడు ఒకరోజు.

"ఈ జాతి పక్షులు అంతరించి పోయే ప్రమాదంనుండి తప్పించాలని నా తాపత్రయం" చెప్పాడు.

"అవి ఎందుకు అంతరించి పోతున్నాయి?"

"మనిషి స్వార్థం! మాంసాహారం కోసం, గోళ్ల కోసం, చర్మాలకోసం, దంతాల కోసం మానవుడు ఎన్నో జాతుల్ని నిర్ధాక్షిణ్యంగా వేటాడి చంపుతూ అవి అంతరించి పోవడానికి కారకుడవుతున్నాడు".

"అలానా! మరి అలా చంపటం తప్పుకాదూ"?

"తప్పేకాదు, ఎంతోనేరం, దుర్మార్గంకూడా".

"మరి ఈ పక్షులకు బుల్లి బుల్లి పిల్లలేవి?" ఆసక్తిగా అడిగారు.

"త్వరలో పుడతాయి. అప్పుడా పిల్లలకు ఇంకా పిల్లలు...ఆ పిల్లలకు మరిన్ని పిల్లలు...అలా అలా ఎన్నెన్నో....పుట్టి పెరగాలి. అప్పుడే ప్రకృతి పరవశిస్తుంది" అంటూ భూమి మీద నివశించే జీవరాశుల మధ్య వున్న సంబంధాల గురించి పిల్లలకు వివరించేవాడు.

"ఏమిటి నాన్నా ఇదంతా! ఆ పక్షుల కోసం నీ శక్తియుక్తుల్ని ఎందుకు ధారపోస్తావు? నా ఫ్రెండొకతను రెసిడెన్షియల్ కాలేజి పెట్టాడు. నువ్వు క్లాసెస్ తీసుకుంటానంటే నెలకు పదివేలు-ఇవ్వటానికి సిద్ధంగా వున్నాడు" చెప్పాడు పెద్ద కొడుకు.

"ముప్పైయ్యేళ్లు రొటీన్‌గా స్టూడెంట్స్‌కు పాఠాలు చెప్పి చెప్పీ విసుగెత్తి పోయింది. టీచింగ్ కన్నా, వాళ్లిచ్చే డబ్బుకన్నా నాకు సంతృప్తి కలిగే పనే నేను చేస్తున్నాను" అంటూ కొడుకుల ప్రతిపాదన తిరస్కరించాడు.

దాంతో కొడుకులిద్దరికీ కోపం వచ్చినట్లుంది. భార్యపిల్లల్ని తీసుకుని వెంటనే వెళ్లి పోయారు. అది గ్రహించిన రాధాకృష్ణయ్య అంతగా పట్టించు కోలేదు.

ఎండా కాలం గడిచింది. రాధాకృష్ణయ్య మనస్సంతా విషాదం ఆవరించింది. గ్రీష్మంలో తను ఆశించినది జరగక పోవటం అతనిని కృంగదీయసాగింది. వసంతం కూడా ఇలానే గడిచిపోతే తను పడుతున్న కష్టానికి విలువేముంది? నిద్రాహారాలు సరిగా లేకుండా రోజూ మధనపడుతున్నాడు.

పక్షుల్ని పరిశీలించేందుకు అడపదడపా ఇతర యూనివర్సిటీల నుండి విద్యార్థులు, బర్డ్ వాచర్స్, ఆర్నిథాలజిస్ట్‌లు వచ్చి పోతున్నారు. గంటల తరబడి ఆ విషయమే వారితో చర్చించాడు. ఎవరూ సరైన సూచనగాని, ప్రతిపాదనగాని చెయ్యలేక పోయారు. లోపం ఎక్కడుందన్న విషయం అంతుబట్టటం లేదు.

రాధాకృష్ణయ్య తను చదివిన పుస్తకాలన్నీ మళ్లీ ముందేసుకొని అదే పనిగా వాటిని అధ్యయనం చెయ్యసాగాడు.

పక్షుల ప్లూమేజి, మేటింగ్ కాల్స్, నప్షల్ డాన్స్, గుడ్లు పెట్టటం, పిల్లల్ని చెయ్యటం మొదలైన విషయాలను క్షుణ్ణంగా చదవసాగాడు. అప్పుడే ఒక అంశం అతని దృష్టిలో పడింది.

పక్షులు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు గాని, ఆహారం సమృద్ధిగా లభించని పరిస్థితుల్లో గాని గుడ్లు పెట్టటం వాయిదా వేసుకొంటాయి. అంటే అననుకూల పరిస్థితుల్లో సంతతిని పెంపు చేసుకోవటాన్ని వ్యతిరేకిస్తాయన్నమాట. విపరీత జనాభాతో సమస్యలు కొని తెచ్చుకుంటూ జీవితాన్ని జటిలం చేసుకొంటున్న ఆధునిక మానవునికి ఈ మాత్రం జ్ఞానం వుంటే ఎంత బాగుండేది అనుకొన్నాడు రాధాకృష్ణయ్య.

బ్రీడింగ్‌కు అనుకూలంగా లేని పరిస్థితులేమిటన్న అంశం మీద తీవ్రంగా ఆలోచించ సాగాడు. వాస్తవానికి పొదలు, తుప్పలతో కూడిన విశాలమైన మైదానాల్లో నివశించేవి ఈ జాతి పక్షులు. అలా సహజంగా నివసించే పరిసరాల్ని, వాతావరణాన్ని కల్పించలేక పోవటం ఒక కారణం కావచ్చేమో! ఆనందంగా ఎగిరేందుకు, పరుగులు పెట్టేందుకు వీలు లేకుండా చుట్టూ వలతో, కేవలం కొద్ది మీటర్ల పరిధిలోనే ఒదిగి నివసించాల్సిన దుస్థితి కన్న విపత్కర పరిస్థితులేముంటాయి? ఈ సమస్యను ఎలా పరిష్కరించటం?

రాధాకృష్ణయ్య వైస్ ఛాన్సలర్‌ని కలిశాడు. పక్షులు నివసిస్తున్న పరిసరాలలో మార్పు తీసుకురావలసిన అవసరాన్ని వివరించి చెప్పాడు.

"మీ ఆలోచన మంచిదే! కాని మీరు కోరుతున్న విధంగా ఏర్పాట్లు చేసేందుకు తగిన ఆర్థిక వనరులు మాకు లేవు. మీ పలుకుబడితో అలాంటి ఏర్పాట్లు చేసుకోగలిగితే మీ ఇష్టం". తేల్చి చెప్పాడు వైస్ ఛాన్సలర్.

వైస్ ఛాన్సలర్ ఎలాంటి అభ్యంతరాలు పెట్టకుండా అంగీకరించినందుకే సంతోషించాడు రాధాకృష్ణయ్య. తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ నుండే ఆ మొత్తం సొమ్మును వెచ్చించటానికి నిర్ణయించుకొన్నాడు.

బర్డ్స్ శాంక్చువరీకి దక్షిణ దిశగా రెండువేల చదరపు గజాల స్థలాన్ని అందుకు ఎంపిక చేశాడు. పెద్ద వల తెప్పించి ఆవరణంతా అమర్చాడు. రాళ్లు రప్పలు లేకుండా శుభ్రం చేయించాడు. పొదలు, తుప్పలుగా ఎదిగే వివిధ రకాల మొక్కలు పెట్టించి ఇద్దరు మనుషుల్ని మొక్కల సంరక్షణకు నియమించాడు. పూర్తి కాలం పక్షుల సంరక్షణకు వెచ్చించేందుకు అక్కడే ఒక చిన్న కుటీరాన్ని తన కోసం ఏర్పాటు చేసుకొన్నాడు. ఏర్పాట్లు పూర్తయ్యాక పక్షుల జంటను వాటి కోసం నిర్దేశించిన ప్రాంతంలోకి మార్చాడు.

రోహిణి కార్తె దాటుతూనే వర్షాలు మొదలయ్యాయి. వర్షాలకు పొదలు, తుప్పలు చక చకా పెరిగాయి. మైదానంలా నేలంతా పచ్చగడ్డి పరుచుకున్నది.

ఇప్పుడు పక్షులకు కావలసినంత విహారస్థలం. జంటగా అవి పరుగులు తీస్తూ, భారంగా పైకి లేస్తూ, క్రమబద్ధంగా రెక్కలు కదిలిస్తూ గాల్లోకి ఎగురుతున్నాయి. వాటికి మిడతలు, గడ్డి పురుగుల్లాంటి ప్రీతి కరమైన ఆహారం కావలసినంత లభిస్తున్నది.

ఎదురు చూస్తున్న వసంతం రానే వచ్చింది. కనుచూపు మేర పచ్చని చెట్లతో ప్రకృతి సింగారించుకొని వయ్యారి భామలా వుంది.

ఒకరోజు ఉదయం చిత్రమైన ధ్వనితో రాధాకృష్ణయ్యకు అదాటున మెలకువ వచ్చింది. కొద్దిక్షణాలు ఆ ధ్వని ఏమిటన్నది ఆయనకు అంతు బట్టలేదు. ఊపిరి బిగపట్టి మళ్లీ ఆ ధ్వని వినవస్తుందేమోనని ఒళ్లంతా చెవులు చేసుకొని ఎదురు చూడసాగాడు. తిరిగి అదే విచిత్రమైన ప్రత్యేక ధ్వని! అదేమిటో పసిగట్టాడు. ఒక్క ఉదుటున ముసుగుదీసి బెడ్ మీద నుండి కిందకు దిగి చక చకా కిటికీ కేసి పరుగెత్తాడు.

గరుడ, రోజూలా కాకుండా విభిన్నంగా, వింతగా గొంతెత్తి అరుస్తూ రాణి వెంట అల్లరిగా పరుగులు పెడ్తూ సయ్యాటలాడుతున్నది. ప్రియురాలి సమాగమానికై తహ తహ లాడుతూ విరహ గీతికలు పాడుతున్నది. ఆ మేటింగ్ కాల్ ప్రకృతి పిలుపులా ఆ ప్రాంతమంతా చిత్రంగా ప్రతిధ్వనిస్తున్నది.

రాధాకృష్ణయ్య ఆనందానికి అవధులు లేవు. గరుడ చేస్తున్న ధ్వనిని అనుకరిస్తూ గొంతెత్తి తనూ అరిచాడు. తన కలలు వాస్తవమయ్యే సుముహూర్తం దగ్గరలోనే వుందనిపించింది. అంతరించి పోతుందనుకొంటున్న ఆ పక్షి జాతికి వాటి సమాగమమే పునర్జన్మగా భావించాడు.

యౌవ్వన కాంతులతో గరుడ దేహం కొత్త రంగుల్ని సంతరించుకొన్నది. అది విరహగీతికలు పాడుతూ రాణి చుట్టూ వలయాలు చుడుతూ చేస్తున్న నప్షల్ డాన్స్ శోభాయమానంగా వుంది. చిన్న చిన్న గడ్డి పురుగుల్ని, మిడతల్నీ ఏరి కోరి పట్టి తెచ్చి కొసరి కొసరి ప్రియురాలికి ప్రేమగా అందిస్తూ ప్రసన్నం చేసుకొనే దృశ్యం చూడ ముచ్చటగా వుంది.

కొద్ది రోజులు గడిచాయి.

ఆ పక్షి జంట ఓ ఉదయం చిన్న పొదచుట్టూ తిరుగుతూ చేస్తున్న హడావుడికి అటు వెళ్లాడు. పొదలోకి చూస్తూనే ఒక్కసారి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు రాధాకృష్ణయ్య. పొదలో పిడికిలంత పరిమాణంలో వున్న రెండు గుడ్లు కనిపించాయి. పేల్ ఆలివ్ గ్రీన్ రంగులో, ముదురు జేగురురంగు వర్ణపు మచ్చలతో లేత సూర్యకాంతిలో తళ తళ మెరుస్తూ ఎంతో ఆకర్షణీయంగా వున్నాయవి.

ఆ గుడ్లు చూస్తూనే రాధాకృష్ణయ్య మనస్సు పరమానందభరితమైంది. ఆ ఆనందంలో చిన్న పిల్లాడిలా చిందులు వెయ్యాలనిపించింది. పక్షుల జంటను చేతుల్లోకి తీసుకొని వాటి సన్నని మెడ మీద ముద్దుల వర్షం కురిపించాడు.

ఆ గుడ్లనుండి పిల్లలు ఎంత త్వరగా వస్తాయా అన్న ఆత్రుత రోజు రోజుకు ఎక్కువ కాసాగింది. ఆ శుభఘడియల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడసాగాడు.

ఆ పక్షి జంట గుడ్ల పట్ల ఎంతో శ్రద్ధ, జాగ్రత్త కనబరుస్తున్నాయి. ఆడపక్షి గుడ్లను వదిలి ఎటూ కదలటం లేదు. మగపక్షి ఆహారాన్ని గాలించి తెచ్చి ఆడ పక్షికి అందిస్తున్నది. కొత్త మనుషుల్ని పసిగడ్తే చాలు 'కుర్ కుర్' మంటూ అరచి గోల పెడ్తున్నాయి. పరిసరాల్లో ఏ మాత్రం చిన్న అలికిడైనా అవి అప్రమత్తమవుతున్నాయి.

ఒక రోజు సాయంత్రం కుటీరంలో ఉన్న రాధాకృష్ణయ్యకు పక్షుల అరుపులు భీకరంగా వినిపించసాగాయి. అవి బెదిరినట్లుగా వాటి అరుపులు గగ్గోలుగా ధ్వనిస్తున్నాయి. ఒక్క ఉదుటున బయటికి దూసుకొచ్చాడు. అప్పుడతని కంటబడిన దృశ్యానికి ముచ్చెమటలు పోశాయి.

గుడ్లకు కొద్ది గజాల దూరంలో ఒక నాగుపాము పడగ విప్పి బుసలు కొడుతూ నిలబడుంది. ఆడపక్షి గుడ్లను కాసుకొని అరుస్తూ వుంటే, మగపక్షి పాము మీద యుద్ధానికి సిద్ధంగా వుంది. పాము కదిలితే చాలు గరుడ దాన్ని పొడవ బోతున్నది. పాము కాటు వేయటానికి ప్రయత్నిస్తూ మెల్ల మెల్లగా గుడ్ల వైపుకు పాకుతున్నది.

ఒక్క నిమిషం రాధాకృష్ణయ్య మనస్సు మొద్దు బారినట్లయింది. ఇతరత్రా గుడ్లకు వచ్చే ఇలాంటి ప్రమాదాల గురించి ఆలోచించకుండా ఎంత అవివేకంగా ప్రవర్తించాడో అర్థమైంది. పామును చంపడానికి ఏదన్నా ఆయుధాన్ని ప్రయోగించే వ్యవధి లేదు. నాగుపాము ఆగుడ్డు చెంతకు చేరితే వాటికి కలిగే ముప్పు ఎలాంటిదో గ్రహిస్తూనే అతనిలో ఎక్కడలేని తెగింపు వచ్చేసింది.

ఒక్క పెట్టున ముందుకు ఉరికి, వెనకవైపుగా పడగ భాగాన్ని ఒడిసి పట్టి దూరంగా విసిరెయ్యాలనుకొన్నాడు. రాధాకృష్ణయ్య చేతిలో చిక్కిన నాగుపాము చురుగ్గా వెనుదిరిగి అతని వ్యూహానికి భిన్నంగా కాటు వెయ్యనే వేసింది. అయితేనేం తను అనుకొన్నట్లు ఆ పామును దూరంగా విసరగలిగాడు. అదే సమయానికి పరిగెత్తుకొచ్చిన పని వాళ్లు పామును చంపేశారు.

పనివాళ్ల కేకలకు శాంక్చువరీలో వున్న మిగతా స్టాఫ్ అక్కడికొచ్చారు. రాధాకృష్ణయ్యకు ప్రథమ చికిత్స చేశారు. వ్యాన్ తెప్పించి హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా విషప్రభావంతో స్పృహ తప్పింది.

రాధాకృష్ణయ్యకు ప్రాణ గండం గడిచి స్పృహలోకి రావడానికి రెండు రోజులు పట్టింది. కళ్లు విప్పాక మొదటిగా అడిగింది పక్షుల క్షేమ సమాచారం గురించే!

"డోంట్ వర్రీ! ఎవ్విరిథింగ్ ఈజ్ ఆల్‌రైట్. దుర్గారావుగారు అంతా చూసు కుంటున్నారు" చెప్పారు రాధాకృష్ణయ్యకు.

చివరకు రాధాకృష్ణయ్య కఠోర శ్రమకు, దీక్షకు తగ్గ ఫలితం రానే వచ్చింది. గుడ్లలో ఉన్న పిండాలు ఆకృతి దాల్చి చిన్నారి పక్షుల్లా జీవం పోసుకొని ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టాయి. తల్లి పక్షి అందిస్తున్న ఆహారాన్ని ఆబగా అందుకుంటూ అటూ ఇటూ కదులుతున్న పిల్ల పక్షుల్ని చూడటానికి రెండు కళ్లూ చాలడం లేదు.

ఆ చిన్నారుల చేష్టలు చూస్తూనే రాధాకృష్ణయ్య మనస్సు సంతోష తరంగమైంది. కళ్లు అశ్రుపూరితాలైనాయి.

సమస్త ప్రకృతిలోని అణువణువులోను తన అంశ ఏదో లీనమై పోయిన భావన కలిగి "నథింగ్ షుడ్ పెరిష్. జనరేషన్స్ షుడ్ పెర్ పెట్రేట్ ఈవెన్ ఇఫ్ దే ఆర్ నాట్ ఫిటెస్ట్. సర్వైవల్ మస్ట్‌బి దేర్" అనుకొన్నాడు.

పక్షి పిల్లల పుట్టుక గురించి యూనివర్సిటీ అంతా ప్రచారమైంది. విద్యార్థులు, టీచింగ్‌స్టాఫ్ తండోపతండాలుగా వచ్చి పిల్లల్ని చూసి ముగ్ధులవుతున్నారు. వైస్ ఛాన్సలర్ స్వయంగా శాంక్చువరీకి వచ్చి, "రియల్లీ ఎ గ్రేట్ ఎఛీవ్‌మెంట్ బై ఎ గ్రేట్ పర్సనాలిటీ!" అంటూ రాధాకృష్ణయ్యను అభినందించాడు.

ఆనోట ఆనోటా ఈ విశేషం పత్రికల వారి దాకా పాకింది. న్యూస్ ఐటమ్ కవర్ చేసేందుకు కెమెరాలతో సహా వచ్చిపడ్డారు. రంగురంగుల ఫోటోలు తీశారు. వ్యాసాలు తయారు చేశారు. రాధాకృష్ణయ్యను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు.

"సర్! ఈ పక్షుల సంరక్షణకు వ్యక్తిగతంగా మీరెంతో వ్యయప్రయాసలకు లోనయ్యారని తెలిసింది. అంత శ్రద్ధ మీరెందుకు తీసుకున్నట్లు?"

అడిగాడు ఒక పత్రికా విలేకరి.

"నేడెన్నో జంతు జాతులు అంతరించి పోవటానికి కారణం మనిషి స్వార్థం. జనాభా పెరిగి అడవుల్ని ఆక్రమిస్తున్నాడు. నిలువునా నరికేస్తున్నాడు. 'ఇఫ్ మేన్ టేక్ వెంజన్స్ ఎగెనెస్ట్ నేచర్, ఇన్‌టరన్ నేచర్ వుడ్ టేక్ వెంజన్స్ ఎగెనెస్ట్ హిమ్". ప్రకృతి సహజంగా ఒక జీవికి మరోజీవికి మధ్య జీవావరణపరమైన సంబంధబాంధవ్యాలు వుంటాయి. వాటికి విఘాతం కల్గితే సమతౌల్యం దెబ్బతింటుంది. తద్వారా ఆ ప్రాంతాల్లోని జీవావరణానికి ముప్పు ఏర్పడుతుంది. నేటి ఆధునిక మానవుడు ప్రకృతిపైన ఆధిపత్యం సంపాదించాలన్న దుగ్ధతో,జీవావరణ సమతౌల్యాన్ని నాశనం చేసి తనను తాను ధ్వంసం చేసుకోబోతున్నాడు. ఆ విధ్వంసం ఆగాలన్నదే నా ఆకాంక్ష. ఈ భూమి మీద జీవించే హక్కు ప్రతి జీవికీ వుంది. అది నిర్లక్ష్యం చెయ్యబడితే భవిష్యత్‌లో మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ఈ ప్రమాదాన్ని విధిగా అందరూ గుర్తించాలన్నదే నా తాపత్రయం". వివరంగా చెప్పాడు రాధాకృష్ణయ్య.

మరుసటి రోజు పత్రికలలో పక్షుల రంగురంగుల ఫోటోలతో, వార్తా విశేషాలతో మంచి కవరేజి వచ్చింది. అంతరించబోతున్న ఒక పక్షి జాతికి పునరుజ్జీవనాన్నిచ్చిన మహోన్నత వ్యక్తిగా రాధాకృష్ణయ్యను పత్రికలు వేనోళ్ల ప్రశంసించాయి.

అతని అకుంఠిత దీక్షను లోకమంతా శ్లాఘించినా, కనీసం కొడుకుల దగ్గర్నుండీ గ్రీటింగ్ టెలిగ్రాం అయినా రాలేదు. అయితే రాధాకృష్ణయ్య మనవడి నుండొచ్చిన గ్రీటింగ్ మాత్రం అతనిని ఎంతో సంతోషపరిచింది.

*(ఆంధ్రప్రభ, వారపత్రిక 25.12.1996)*